అందరికీ నచ్చి.. శభాష్ అంటూ మెచ్చి..



పార్కులో వ్యాయామం చేస్తున్న సందర్శకులు

విద్యార్థులకు నిలయంగా..

సాధారణంగా పార్కు అంటే పిల్లలు, పెద్దలు సేదదీరుతుంటారు. ఈ ప్రాంతంలో పోటీ పరీక్షలకు శిక్షణ ఇచ్చే సంస్థలు ఎక్కువగా ఉండటంతో ఆ విద్యార్థులు ఇక్కడ చేరి ఆహ్లాదకరమైన వాతావరణంలో చదువుకోవడం గమనించవచ్చు. ఇక్కడ విద్యార్థులు గ్రూప్ డిస్కషన్స్ చేస్తూ కనిపిస్తారు. పచ్చని ప్రకృతి నడుమ ఎంతో మంది విద్యార్థులు చదువుతూ కనిపిస్తారు. అలాగే ఈ పార్కు చుట్టుపక్కల పని చేసే వారు మధ్యాహ్నం వేళల్లో భోజనం చేసి, కాసేపు కబుర్లతో కాలక్షేపం చేస్తుంటారు.



గ్రూప్ డిస్కషన్ చేస్తున్న యువకులు



డైమండ్ పార్కు దక్షిణం వైపు ద్వారం

- పిల్లలు, పెద్దలు, విద్యార్థుల మనసు చూరగొంటున్న డైమండ్ పార్కు
- ఒక పక్క యువత ఎక్సర్‌సైజ్‌లు.. మరో పక్క పెద్దల వ్యాయామాలు.. ఇంకో పక్క విద్యార్థుల చదువులు
- **అన్ని వయసుల వారికీ అనువైన వేదికగా ప్రఖ్యాతి**



డైమండ్ పార్కులో వ్యాయామం చేస్తున్న యువకుడు



పార్కులో వాకింగ్ చేస్తున్న సందర్శకులు

అల్లిపురం: నగర వాసులు సేదదీరేందుకు ఉద్యానవనాలు అవసరం. అందుకు తగ్గట్టుగా వుడా లేఅవుట్లలో కొంత మేర పార్కులు ఏర్పాటు చేసేవారు. అలాంటి పురాతన లే అవుట్‌గా ద్వారకానగర్ ప్రసిద్ధి పొందింది. 1971 ప్రాంతంలో అప్పటి మున్సిపల్ అధికారులు, నగరాభివృద్ధి సంస్థ ఏర్పాటు చేసిన లే అవుట్ ద్వారకానగర్. ఈ క్రమంలో డైమండ్ రూపంలో నాలుగు రోడ్ల కూడలిలో ఒక పార్కును ఏర్పాటు చేశారు. అందుకే ఈ పార్కును డైమండ్ పార్కు అని పిలిచేవారు. ఇప్పు డు ఈ ప్రాంతం నగరంలోనే అత్యంత ఖరీదైన ప్రాంతం. వ్యాపారాలకు, ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్లకు ప్రసిద్ధి చెందింది. అటువంటి ప్రాంతంలో ఏర్పాటు చేసిన పార్కుకు ప్రాముఖ్యత ఏర్పడింది.

ఈ పార్కును గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో సర్వాంగ సుందరంగా తయారు చేశారు. వాకింగ్ ట్రాక్, జిమ్ ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో అత్యంత రద్దీగా ఉండే ద్వారకానగర్ పరిధిలో గల డైమండ్ పార్క్ వాకర్లు, వ్యాయామాలు చేసేవారు, విద్యార్థులు, పిల్లలకు చక్కటి నెలవుగా మారింది. చుట్టుపక్కల గల కార్యాలయా ల సిబ్బంది, దుకాణాల్లో పని చేసేవారు కూడా ఇక్కడ సేదదీరుతుంటారు. ఉదయం పెద్దలు, యువతీ యువకులు వాకింగ్‌తో పాటు వ్యాయం, జిమ్ చేస్తుంటారు. మధ్యాహ్నం చుట్టుపక్కల వ్యాపార సముదాయాల్లో పని చేసేవారు, కూలీలు పనులు ముగించుకుని పార్కులో తోటి ఉద్యోగులతో కలిసి భోజనాలు చేస్తూ కొంత సేపు సేదదీరుతారు. వివిధ పరీక్షలు రాసే విద్యార్థులు ఇక్కడ చదువుకుంటారు.

పచ్చని చెట్లతో కళకళలాడే ఈ పార్కులో జీవీఎంసీ ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయడం తెలిసిందే. ఇక్కడ పచ్చని మొక్కల నడుమ స్వచ్ఛమైన ఆక్సిజన్ పీలుస్తూ కాలక్షేపం చేస్తుంటారు. పార్కుకు నాలుగు వైపులా గేట్లు ఉండడంతో అటు న్యూకాలనీ, దొండపర్తి, సీతమ్మపేట, మరో వైపు ఎల్ఐసీ బిల్డింగ్, రైల్వే క్వార్టర్స్, ఇంకో వైపు ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి వచ్చేవారే కాక నగరానికి పనిమీద వచ్చిన వారు ఈ పార్కులోకి వచ్చి సేదదీరుతారు. ముఖ్యంగా వృద్ధులు, విశ్రాంత ఉద్యోగులు ఇక్కడ చేరి పిచ్చాపాటి మాట్లాడుకుంటూ కాలక్షేపం చేస్తూ కనిపిస్తారు.

షాపింగ్‌కి వచ్చిన వారు సేదదీరుతారు..

డైమండ్ పార్కు చుట్టుపక్కల ప్రాంతాల్లో పలు షోరూములు ఉన్నాయి. టీవీలు, ఫ్రిజ్‌లు, సెల్‌ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, వస్త్ర దుకాణాలు ఉండడంతో పెద్ద ఎత్తున వినియోగదారులు ప్రతిరోజూ వస్తుంటారు. అలా వచ్చిన వారు చాలా మంది డైమండ్ పార్కులో కాసేపు కాలక్షేపం చేసి వెళ్తుంటారు.

అన్ని విధాలా ఉపయోగకరం..

నగర నడిబొడ్డున ఉండడం వల్ల డైమండ్ పార్కు అందరికీ అందుబాటులో ఉందని చెప్పొచ్చు. అందుకే ఉదయం, సాయంత్రం వేళల్లో యోగా చేసే వారు, వాకర్లు, వ్యాయామాలు చేసేవారు పెద్ద సంఖ్యలో ఈ పార్కుకు వస్తుంటారు. ఇక్కడ ఏర్పాటు చేసిన జిమ్ పరికరాలు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయి. అందుకే పిల్లలు, పెద్దలు కాలక్షేపం చేయడానికి డైమండ్ పార్కు కేరాఫ్‌గా మారిపోయింది.

– హనుమంతరావు, దొండపర్తి

విద్యార్థులకు అనువైన స్థలం..

డైమండ్ పార్కులో వాకర్లు, వ్యాయామం చేసే వారితో పాటు స్టూడెంట్స్ కూడా పెద్ద సంఖ్యలో కనిపిస్తారు. ఇక్కడ విద్యార్థులు చదువుతో పాటు గ్రూప్ డిస్కషన్స్ చేస్తుంటారు. పోటీ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు ఇక్కడ దీక్షగా చదువుతూ కనిపిస్తారు. పార్కు చుట్టూ ఎంత రణగొణ ధ్వనులు ఉన్నా పార్కులో ఉన్న వారికి పెద్దగా అవాంతరం ఉండదు. పచ్చని చెట్ల మధ్య పార్కు ఉండడమే దీనికి కారణం.

– ప్రసాదరావు, ద్వారకానగర్.

క్లుప్తంగా

మర్యాదపూర్వక కలయిక



వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కె.కె. రాజును మర్యాదపూర్వకంగా కలిసిన 33వ వార్డు నాయకులు

అల్లిపురం: జీవీఎంసీ 33వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకుడు పాల శ్రీహరిరెడ్డి ఆధ్వర్యంలో వార్డు నాయకులు, కార్యకర్తలు శుక్రవారం ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కె.కె. రాజుతో పాటు ద్రోణంరాజు శ్రీవత్సవ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. వార్డులో పార్టీ బలోపేతానికి బలమైన నాయకత్వం అవసరమని, అందుకు తగిన వ్యక్తిని నియమించాలని వారు కోరారు. గత వార్డు అధ్యక్షుడు పార్టీ మారటంతో వార్డులో పార్టీ కార్యకర్తలకు దిశా నిర్దేశం చేసేవారు లేరని ఈ సందర్భంగా వారు ఆయనకు వివరించారు. ప్రస్తుతం వార్డు అధ్యక్షుడిగా ఒక వ్యక్తి ప్రచారం చేసుకుంటున్నారని, అతని వల్ల పార్టీకి నష్టం వాటిల్లుతుందని వారు వివరించారు. వార్డులో పార్టీ బలోపేతానికి, పార్టీలో నాయకులకు, కార్యకర్తలకు సన్నిహితంగా ఉండే వ్యక్తిగా పాల శ్రీహరిరెడ్డిని వార్డు అధ్యక్షుడిగా నియమించాలని వార్డు నాయకులు, కార్యకర్తలు నీలాపు అయ్యప్పరెడ్డి, ప్రసాద్‌రెడ్డి, యల్లంకి చిన్నమ్మలు, పి.ఊర్వశి, శివకుమార్, కణితి బ్రహ్మం, పిల్లి శివ, ఊర్వశి, పావని తదితరులు వినతిపత్రం అందజేశారు.

ఘనంగా షిర్డీసాయి మందిర వార్షికోత్సవం



లీలాసుందరినగర్ ఆలయంలో పూజలందుకున్న సాయినాథుడు

ఆరిలోవ: జీవీఎంసీ 12వ వార్డు లీలాసుందరినగర్‌లోని విఘ్నేశ్వర అభయాంజనేయ దత్తాత్రేయ సహిత షిర్డీసాయి ఆలయ వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. గ్రామ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో షిర్డీసాయి విగ్రహాన్ని పూలమాలలు, నూతన వస్త్రాలతో అలంకరించారు. స్థానికులతోపాటు నెహ్రూనగర్, దుర్గానగర్, టీఐసీ పాయింట్ నుంచి భక్తులు బాబాను దర్శించుకుని పూజలు చేశారు. పలు పార్టీలకు చెందిన రాజకీయ నాయకులు సాయిని దర్శించుకున్నారు. సాయంత్రం ఆలయ ఆవరణలో భజనలు తదితర సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

వాటర్ ఫౌంటెయిన్‌ను మూసేసిన టీడీపీ జెండాలు




మహారాణి పార్లర్ జంక్షన్‌లో ఫౌంటెయిన్ చుట్టూ కట్టి వదిలేసిన టీడీపీ జెండాలు

సీతంపేట: కూటమి ప్రభుత్వ పాలన ఏడాది పూర్తయిన సందర్భంగా అక్కయ్యపాలెం మెయిన్ రోడ్డు, మహారాణి పార్లర్ కూడలిలోని వాటర్ ఫౌంటెయిన్‌కు టీడీపీ జెండాలు కట్టారు. ఫౌంటెయిన్ కనిపించకుండా మొత్తం పార్టీ జెండాలతో నింపేశారు. వేడుకలు ముగిసి వారం రోజులు గడిచినా వాటిని మాత్రం తొలగించలేదు. వారం రోజులు గడిచినా టీడీపీ జెండాలు మాత్రం అలాగే దర్శనమిస్తున్నాయి. ప్రతిపక్ష పార్టీలకు చెందిన జెండాలు, ఫ్లెక్సీలను 24 గంటల్లోనే తొలగించే జీవీఎంసీ సిబ్బంది, అధికార పార్టీ జెండాలను మాత్రం వారం రోజులు గడిచినా ఎందుకు తొలగించలేదో వారికే తెలియాలి. గత ప్రభుత్వం కోట్లు వెచ్చించి అక్కయ్యపాలెం మెయిన్ రోడ్డును వెడల్పు చేసి, ఫుట్‌పాత్‌లు, సెంటర్ మీడియన్ నిర్మించింది. మహారాణి పార్లర్ కూడలిలో వాటర్ ఫౌంటెయిన్ నిర్మించింది. దాన్ని మూసివేసేలా ఉన్న టీడీపీ జెండాలను తొలగించాలని పలువురు కోరుతున్నారు.

నేడు వైభవుడికి సుప్రభాత సేవ

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో కొలువైన వైభవ వేంకటేశ్వర స్వామికి శనివారం సుప్రభాత సేవ నిర్వహిస్తారు. తెల్లవారు జా మున సన్నిధిగొల్ల సేవ చేసి సుప్రభాతం చదివి వినిపిస్తారు. అనంతరం స్వామికి అభిషేకాలు చేస్తారు. ఉదయం 7.30 గంటలకు బాలభోగం, 9.30 గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థప్రసాద గోష్ఠి, 10 గంటలకు సామూహిక విష్ణు సహస్రనామార్చన, 11.30 గంటలకు రాజభోగ నివేదన జరుగుతాయి. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేస్తారు. సాయంత్రం 6.30 గంటలకు వైభవుడికి విశేష హారతులు సమర్పిస్తారు.

సిరులతల్లికి క్షీరాభిషేకం



క్షీరాభిషేక సేవలో కనకమహాలక్ష్మి అమ్మవారు

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో కె. శోభారాణి తెలిపారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల పూజకు దంపతులు లేదా ఇద్దరిని అనుమతించనున్నట్టు చెప్పారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు 0891–2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు. కార్యక్రమంలో ఈవో కె. శోభారాణి, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు అమ్మవారికి తులసి పూజ..

కనకమహాలక్ష్మి అమ్మవారి దేవాలయంలో శనివారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు తులసి పూజ నిర్వహించనున్నారు. ఈ పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు.

రేపు భువనేశ్వరీదేవి అధివాస మహోత్సవం



భువనేశ్వరి అమ్మవారు

డాబాగార్డెన్స్: విశాఖ జిల్లా యాతపాలెంలోని చెల్లాయమ్మతోటలో వేంచేసిన భువనేశ్వరీదేవికి ఈ నెల 22న దేవకాంచాన పత్రితో అధివాస మహోత్సవం నిర్వహించనున్నట్టు భువనేశ్వరీదేవి ఆరాధన పీఠం, ఓం భువనేశ్వరీ సంస్థాన్ ట్రస్ట్ నిర్వాహకుడు మురళీకృష్ణ తెలిపారు. ఆ రోజు ఉదయం పండితులు, పెద్దలతో అమ్మవారికి ప్రత్యేక పూజలు, సుగంధ ద్రవ్యాలతో మంగళ స్నానం జరుగుతుందని, భక్తులు చీర, జాకెట్టు, రామఫలం, తమలపాకు తదితరాలతో పూజలు చేసుకోవచ్చని చెప్పారు.

యోగా దినోత్సవ ఏర్పాట్లను పరిశీలించిన సీఎస్



ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విజయానంద్

మహారాణిపేట: బీచ్‌రోడ్డులో అంతర్జాతీయ యోగా దినోత్సవ ఏర్పాట్లను రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ శుక్రవారం పరిశీలించారు. ప్రధాన వేదిక, కంపార్ట్‌మెంట్లు, ఎల్ఈడీ స్క్రీన్స్, సౌండ్ సిస్టమ్‌లను ఆయన పరిశీలించి, అధికారులకు తగు సూచనలు చేశారు. అన్ని విభాగాల అధికారులు అప్రమత్తంగా, సమన్వయంతో పనిచేయాలని, ఎటువంటి అసౌకర్యం కలగకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని సీఎస్ ఆదేశించారు. ఈ పర్యటనలో వైద్యారోగ్యశాఖ కమిషనర్ వీరపాండ్యన్, ఇతర అధికారులు పాల్గొన్నారు. రాష్ట్రంలోని సుమారు లక్షా యాభై వేల ప్రదేశాల్లో శనివారం యోగా ప్రదర్శనలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామని యోగాంధ్ర నోడల్ అధికారి, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటి కృష్ణబాబు తెలిపారు. విశాఖపట్నంలో ప్రధాని, సీఎం, ఉపముఖ్యమంత్రితో పాటు ఇతర మంత్రులు యోగా ప్రదర్శనలో పాల్గొంటారని, అదే సమయంలో రాష్ట్రవ్యాప్తంగా లక్షన్నర ప్రదేశాల్లో ప్రదర్శనలు జరుగుతాయని ఆయన వివరించారు. ఇది ఒక సరికొత్త రికార్డు అని పేర్కొన్నారు. సుమారు పదివేల వాహనాల్లో మూడు లక్షలకు పైబడి ప్రజలు పాల్గొనేలా ఏర్పాట్లు చేసినట్లు, ఏయూ గ్రౌండ్‌లో 25 వేల మంది విద్యార్థులతో 15 నిమిషాలపాటు సూర్య నమస్కారాలు చేయడం ద్వారా మరో కొత్త రికార్డును సృష్టిస్తున్నామని కృష్ణబాబు వెల్లడించారు.

మాదక ద్రవ్యాల నిరోధానికి కృషి



సీఆర్‌పీఎఫ్ కార్యాలయ ఆవరణలో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, సిబ్బంది

ఆరిలోవ: నాషా ముక్త్ భారత్ పఖ్వాడా ఆధ్వర్యంలో శుక్రవారం విశాలాక్షినగర్‌లోని సీఆర్‌పీఎఫ్ 198 బి.ఎ స్.కార్యాలయ ఆవరణలో అంతర్జాతీయ మాదకద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథి సీఆర్‌పీఎఫ్ సెకండ్ ఇన్ కమాండ్–198 బి.ఎస్.మహ్మద్ రాజి ఇక్కడి సిబ్బందితో మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా గురించి ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మాదకద్రవ్యాలపై అవగాహన కల్పించారు. చేయాలన్నారు. కార్యక్రమంలో సీఆర్‌పీఎఫ్–198 బి.ఎస్.డిప్యూటీ కమాండెంట్ భగత్ సింగ్, సుబేదార్ మేజర్ సంజీవ్‌కుమార్, ఇన్‌స్పెక్టర్ బి.రవికుమార్, మినిస్టీరియల్ ఇన్‌స్పెక్టర్ షర్మిలా శర్మ, సబ్ ఇన్‌స్పెక్టర్ విక్రమ్ సింగ్, ఏఎస్ఐలు, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

యోగాంధ్ర జయప్రదానికి పూజలు



యోగాసనాలు వేస్తున్న జర్నలిస్టులు

డాబాగార్డెన్స్: పరమశివుడు శక్తి, పంచ తత్వాల సహాయంతో యోగాంధ్ర–2025 జయప్రదం అవుతుందని ప్రజాపిత బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వ విద్యాలయం ప్రతినిధులు రామేశ్వరి, శివలీల, సోమేశ్వరి అభిలషించారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం డాబాగార్డెన్స్‌లోని వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో జర్నలిస్టులకు ప్రత్యేక వర్క్ షాప్ నిర్వహించి, అందరితో యోగా సాధకుడు సన్యాసిరావు యోగాసనాలు వేయించారు. ముందుగా బ్రహ్మకుమారీస్, జర్నలిస్టులు సంయుక్తంగా విశాఖలో చేపట్టిన యోగాంధ్ర పూర్తిగా విజయవంతం కావాలని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రహ్మకుమారీలు రామేశ్వరి, శివలీల మాట్లాడుతూ పవిత్ర భారతదేశంలోనే యోగా పుట్టిందన్నారు. ఇతర దేశాల్లో వెస్టర్న్ నాగరికత పట్ల ఆసక్తి చూపిస్తారన్నారు. యోగా అంటే మూడు అర్థాలున్నాయని తెలిపారు. సంబంధం జోడించుట, కలయిక, ప్రాప్తిగా వీటిని చెప్పుకోవచ్చన్నారు. యోగం అనేది మతాలు, కులాలు, ధర్మాలకు అతీతమైనదన్నారు. విశాఖ వేదికగా నిర్వహిస్తున్న యోగాంధ్ర కార్యక్రమం యావత్ ప్రపంచం చూస్తుందన్నారు. జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు మాట్లాడుతూ ప్రతి ఏటా జర్నలిస్టుల కోసం బ్రహ్మకుమారీస్ నేతృత్వంలో క్రమం తప్పకుండా యోగా డే వేడుకలు నిర్వహిస్తూ వస్తున్నామన్నారు. యోగాంధ్రలో ఈ ఏడాది అందరం భాగస్వాములు కావడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో సీనియర్ పాత్రికేయుడు నాగరాజు పట్నాయక్, పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు.

అట్రాసిటీ కేసు నమోదు చేయాలని ఆందోళన



నిరసన తెలుపుతున్న కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం ప్రతినిధులు

డాబాగార్డెన్స్: మిరాజ్ సినిమా హాల్లో పని చేస్తున్న గిరిజన మహిళను కులం పేరిట దూర్భాషలాడి, అవమానించిన జ్యోతి, వెంకటేష్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఎల్ఐసీ బిల్డింగ్ వద్ద నిరసన చేపట్టారు. సంఘం ఉపాధ్యక్షుడు వై.రాజు మాట్లాడుతూ చంద్రబాబునాయుడు అధికారంలోకి వచ్చిన తర్వాత దళితులు, గిరిజనులు, మైనార్టీలపై విపరీతంగా దాడులు పెరిగాయన్నారు. గత ప్రభుత్వంలో దళితులు, గిరిజనులు, మైనార్టీలపై దాడులు పెరిగాయని, మేము అధికారంలోకి వచ్చాక వీళ్లందరికీ న్యాయం చేస్తామని చంద్రబాబునాయుడు హామీ ఇచ్చారన్నారు. అయితే కూటమి ప్రభుత్వ హయాంలో మరింతగా దాడులు పెంచి అన్యాయం చేస్తుందన్నారు. రాష్ట్రంలో ఎక్కడ చూసినా దళితులపై దాడులు ఎక్కువయ్యాయన్నారు. సాక్షాత్తు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నియోజకవర్గంలో మహిళను చెట్టుకి కట్టి కొట్టిన సంఘటనే ఉదహరణగా పేర్కొన్నారు. ఇప్పటికైనా దళిత, గిరిజన వ్యతిరేక చర్యలు విడనాడాలని, కులం పేరిట దూర్భాషలాడుతూ దాడికి పాల్పడిన జ్యోతి, వెంకటేష్‌పై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. నిరసనలో సిటు జగదాంబ జోన్ నాయకులు ఎం.సుబ్బారావు, కర్రి చంద్రశేఖర్, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

జీసీల సమస్యలు పరిష్కరించాలి

ఏయూక్యాంపస్: రాష్ట్రంలోని బీసీ సామాజిక వర్గ సమస్యలు పరిష్కరించే దిశగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలని ఏపీ వెలమ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లగుడు గోవిందరావు విజ్ఞప్తి చేశారు. బీచ్ రోడ్డులోని ఒక సమావేశ మందిరంలో శుక్రవారం ఆయన వెలమ నాయకులు, మేధావులతో సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో 50 లక్షలకు పైగా వెలమ సామాజిక వర్గానికి చెందిన ప్రజలు ఉన్నారని, వీరికి ఆర్థిక, సామాజిక రంగాల్లో తగిన ప్రాతినిధ్యం కల్పించాలని డిమాండ్ చేశారు. వెలమ సంక్షేమ సంఘం అదనపు ప్రధాన కార్యదర్శి పెదిరెడ్ల సత్యం, జిల్లా ఇన్‌చార్జి రెడ్డి ఈశ్వరరావు, అనకాపల్లి ఇన్‌చార్జి బర్ల పైడం నాయుడు, గంగు మన్మథరావు తదితరులు పాల్గొన్నారు.

గాయత్రి ఆలయ వార్షికోత్సవాలకు అంకురార్పణ



అభిషేకాలు చేస్తున్న అర్చకులు



అభిషేకానికి సిద్ధం చేసిన కలశాలు

పెందుర్తి: చినముషిడివాడ సమీపంలోని శ్రమ శక్తినగర్‌లో కొలువుదీరిన పంచముఖ గాయత్రిమాత ఆలయ 15వ వార్షికోత్సవ కార్యక్రమాలు శుక్రవారం శాస్త్రోక్తంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు సుప్రభాత సేవ, కలశాభిషేకం, అలంకరణ, సర్వదర్శనం, వేదపారాయణం, లలితా సహస్రనామం, హనుమాన్ చాలీసా పారాయణం జరిగాయి. ప్రసాద వితరణ చేపట్టారు. సాయంత్రం పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. రెండోరోజు శనివారం సుప్రభాత సేవ, లలిత సహస్ర నామార్చన, అష్టోత్తర నామ పారాయణ, హనుమాన్ చాలీసా, సాయంత్రం ఊయల సేవ, దీపాలంకరణ, గాయత్రీ హోమం, పూర్ణాహుతి నిర్వహిస్తామని ఆలయ ధర్మకర్త సరస్వతుల నరసింహమూర్తి తెలిపారు.

వలస పాలనపై పోరాడిన సాహితీవేత్త గూగి వా థియోంగో



మాట్లాడుతున్న వీక్షణం సంపాదకుడు వేణుగోపాల్

అల్లిపురం: వలస పాలనలో, వలస అనంతర పాలనలో జరిగిన దోపిడీపై పోరాడిన సాహితీవేత్త గూగి వా థియోంగో అని వీక్షణం సంపాదకుడు ఎన్. వేణుగోపాల్ అన్నారు. వైవీకే అధ్యయన కేంద్రం, అరసం సంయుక్తంగా విశాఖలో శుక్రవారం నిర్వహించిన గూగివా సంస్మరణ సభలో ఆయన మాట్లాడారు. గూగి వా తొలుత మార్క్సిస్టుగా, చివరిలో మావోయిస్టుగా చెప్పుకున్నారని తెలిపారు. మొదట్లో ఆంగ్ల భాషలో సాహితీ సేద్యం చేసిన ఆయన తర్వాత మాతృ భాష గికుయులోనే రచనలు చేశారని అన్నారు. అమెరికాలో ఉంటూ ఆ భాషలోనే సాహితీ పత్రిక నడిపారని తెలిపారు. 1938లో పుట్టిన ఆయన 40 ఏళ్లు కెన్యాలో, మిగతా 47 ఏళ్లు ప్రవాసంలో జీవించారని తెలిపారు. 27వ ఏట ప్రశ్నించడం ప్రారంభించారని చెప్పారు. కవిత్వం, కథ నాటకాలు, నాటికలు, సాహిత్య విమర్శ, నవలలు, పిల్లల సాహిత్యం సృజించిన గొప్ప వ్యక్తి గూగివా అని పేర్కొన్నారు. మిత్ర సాహితీకి చెందిన విశాఖ వర్మ మాట్లాడుతూ కెన్యా, భారత్ రెండూ బ్రిటిష్ వలస పీడిత దేశాలని చెప్పారు. తేయాకు తోటల్లో పని చేసేందుకు, రైల్వే లైన్లు వేసేందుకు మన దేశం నుంచి అనేక మందిని బ్రిటిష్ పాలకులు కెన్యా తీసుకెళ్లారని తెలిపారు. వారిలో ముకాన్ సింగ్ కార్మిక సంఘాలు స్థాపించారని, కెన్యా స్వాతంత్రం కోసం కృషి చేశారని అన్నారు. స్వాతంత్ర్యానంతరం భారతీయులు కెన్యాలో వ్యాపారులుగా స్థిరపడ్డారని చెప్పారు. ఈ కార్యక్రమానికి మార్క్సిస్టు అధ్యయన వేదిక కన్వీనర్ జేవీ సత్యనారాయణమూర్తి అధ్యక్షత వహించగా. అరసం ప్రతినిధులు సీఎస్ క్షేత్రపాల్, ఉప్పల అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్హత సడలింపుపై ఏపీసీఆర్ఏఎఫ్ హర్షం

ఎంవీపీకాలనీ: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్, సభ్యుల నియామకాల్లో విద్యార్హతను సడలిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంపై ఏపీ చైల్డ్ రైట్స్ అవేర్నస్ ఫోరం (ఏపీసీఆర్ఏఎఫ్) హర్షం వ్యక్తం చేసింది. ఈ మేరకు ఫోరం అధ్యక్షురాలు గొండు ధనలక్ష్మి, న్యాయ సలహాదారు ఎ.ప్రవీణా త్రినాథ్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కమిషన్ చైర్మన్, సభ్యుల నియామకానికి ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేయగా.. గతంలో ఎన్నడూ లేని విధంగా ఆయా పదవులకు పీజీని విద్యార్హతగా పేర్కొందని తెలిపారు. కమిషన్ నియమ నిబంధనలకు వ్యతిరేకంగా కూటమి ప్రభుత్వం వ్యవహరించిందంటూ ఫోరం దుయ్యబట్టిందని చెప్పారు. నోటిఫికేషన్‌లో విద్యార్హతను మార్చాలంటూ ప్రభుత్వానికి లేఖ రాయడంతోపాటు న్యాయపరంగాను పోరాడామన్నారు. దీంతో దిగివచ్చిన కూటమి ప్రభుత్వం గతంలో పీజీగా ప్రకటించిన విద్యార్హతను డిగ్రీకి కుదిస్తూ మరోసారి ఉత్తర్వులు జారీ చేసిందని తెలిపారు. ఇది ఏపీసీఆర్ఏఎఫ్, రాష్ట్ర బాలల విజయంగా వారు పేర్కొన్నారు. ఈ నియామకాల్లో చట్టాల్లో సైతం విద్యార్హత ఎక్కడా పేర్కొనిలేదన్నారు. వివిధ రూపాల్లో 10 ఏళ్ల బాలలకు చేసిన సేవా కార్యక్రమాలను ప్రామాణికంగా గతంలో ఆయా పదవుల్లో నియామకాలు జరిగేవన్నారు. డిగ్రీ విద్యార్హతను సైతం తొలగించి గతంలో మాదిరిగా నియామకాలు చేపట్టాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.